

జి-20 సదస్సుకు ఉపాధ్యాయుడు శ్రీనివాసదొర

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 15 నుంచి 19 వరకు న్యూఢిల్లీలో జరిగిన జి20 శిఖరాగ్ర సమావేశంలో ఆంధ్రప్రదేశ్ నుంచి అకడమిక్ డెలిగేట్‌గా కంటోన్మెంట్ మున్సిపల్ హై స్కూల్ నుండి హిందీ ఉపాధ్యాయులు ఎస్ శ్రీనివాస్ దొర పాల్గొన్నారు. ఈయనకు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ విజయవాడ బ్రాంచ్ ఆహ్వానం అందడంతో ఆయన ఐఐసి – 2025 జనరల్ మీటింగ్ లో పాల్గొన్నారు. ప్రస్తుతం ఎలక్ట్రికల్,ఎలక్ట్రానిక్ రంగంలో సాధించిన సాంకేతిక అభివృద్ధి ముఖ్యంగా భారత్ ఈ రంగాల్లో సాధించిన ప్రగతిపై అవగాహన పొందడానికి బిఐ ఎస్ సంస్థ కల్పించిన ఈ అరుదైన అవకాశంగా శ్రీనివాస్ దొర చెప్పారు.

పేర్లు తొలగింపునకు రూ.కోటి

- కొలిక్కిరాని జగనన్న భూసర్వే లోపాలు
- సరిచేయకుండానే కూటమి ప్రభుత్వం సర్వేలు

సర్వేరాళ్లపై జగనన్న పేర్లు చెరపడానికి కూటమి ప్రభుత్వం రూ.కోటికి పైగా ఖర్చుచేసింది. ఔను...! మీరు చదువుతున్నది, వింటున్నది నిజమే. ఇంకా చెప్పాలంటే అక్షరాల రూ.కోటీ 2 లక్షల 60 వేలు. దీనిపై చూపిన శ్రద్ధ నాటి సర్వేలో జరిగిన లోపాలు సరిచేయడానికి చూపారా? అంటే అటువంటిదేమీ లేదనే సమాధానం జిల్లా వ్యాప్తంగా వినిపిస్తోంది. తానేమీ తక్కువ కాదన్నట్టుగా కుటమి ప్రభుత్వం కూడా భూ సర్వేలను శరవేగంగా సాగిస్తోంది. ఒత్తిడి కాస్త ఎక్కువగానే ఉండడంతో ఇందులో ఎన్ని తప్పులు జరిగిపోతాయో తెలియని పరిస్థితి ఉందని ఇటు రెవెన్యూ సిబ్బంది, అధికారులు, అటు ప్రజానీకంలోనూ ఆందోళన వ్యక్తమౌతోంది.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



సర్వే రాళ్లపై ఉన్న మాజీ సిఎం జగన్ ఫొటో (ఫైల్)

గత వైసిపి ప్రభుత్వ హయాంలో జగన్న భూ సమగ్ర సర్వే చేపట్టిన సంగతి తెలిసిందే. జిల్లా వ్యాప్తంగా 984 రెవెన్యూ గ్రామాలకుగాను మొత్తం మూడు దశల్లో 502గ్రామాల్లో రీసర్వే చేపట్టారు. తమ ప్రభుత్వ హయంలోనే మొత్తం పని జరిగిపోవాలన్న కీర్తికాంక్షతో వ్యవహరించడం వల్ల కొండనాలుక్కి మందు వేస్తే ఉన్న నాలుక ఊడిపోయినట్టు, కొత్త సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ఒకరి భూములు మరొకరిపేరున, జాయింట్ ఎల్‌పిఎంలు నమోదు చేయడం వంటి అనేక తప్పిదాల వల్ల ఇప్పటికీ భూమి యజమానులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. క్రయ, విక్రయాలకు ఆటకం మొదలు పంట రుణాలు పొందేందుకు వీలు కలగనంత వరకు వెళ్లింది. సరిహద్దు రాళ్లకు, దానిపై జగన్ బొమ్మలకు, వైఎస్ఆర్ జగనన్న భూరక్ష అనే రాతలకు నాటి ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేసింది. వీటి సంగతి అటుంచితే నాటి సర్వేలో జరిగిన లోపాలు, తప్పిదాలవల్ల భూమి యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెవెన్యూ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా సమస్యలు పరిష్కారం కావడం లేదని చాలా మంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ లెక్కలు కూడా ఇందుకు అనుగుణంగానే ఉన్నాయి సుమా..! కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేవలం జాయింట్ ఎల్‌పిఎం సమస్యల పరిష్కారం కోసం జిల్లా వ్యాప్తంగా 26,349 దరఖాస్తులు అందగా, ఇప్పటి వరకు కేవలం 1500 దరఖాస్తులను మాత్రమే పరిశీలనలోకి తీసుకున్నట్టు సాక్షాత్తు అధికారిక లెక్కలే స్పష్టం చేస్తున్నాయి. ఇంకా దరఖాస్తులు కూడా చేసుకోక, తెలియక ఉండిపోయిన వారెందరో ఉన్నారు. ఇటుంటి తరుణంలో లోపాలను సరిచేసేందుకు చొరవ తీసుకోవాల్సిన కూటమి ప్రభుత్వం తానేం తక్కువ కాదన్నట్టుగా అధికారంలోకి రాగానే మండలానికొకటి చొప్పున 27 రెవెన్యూ గ్రామాల్లో మొదటి దశ సర్వే చేపట్టింది. ఇది ఇప్పటికే పూర్తి అయినట్టు సర్వే అండ్ ల్యాండ్స్ రికార్డు జిల్లా అధికారి స్పష్టం చేశారు. రెండవ దశలో మండలానికి 2రెవెన్యూ గ్రామాల చొప్పున 48గ్రామాల్లో సర్వే ప్రారంభమైంది. ఈ గ్రామాల్లో ఇప్పటికే గ్రౌండ్ ట్రూత్ పూర్తి చేసినట్టు అధికారులు చెబుతున్నారు. మూడోదశలో మిగిలివున్న 388గ్రామాల సర్వే చేపట్టేందుకు కూడా కసరత్తు చేస్తున్నట్టుగా సమాచారం. ఇటు ప్రభుత్వ సర్వే జరుగుతున్నా ఆయా గ్రామాల్లో భూముల సరిహద్దు సమస్యలు, నమోదులో తప్పుల తడకలు కొనసాగుతునే ఉండడం గమనార్హం. వీటిపై దృష్టిపెట్టకుండా కేవలం గతంలో పాతిన సర్వే రాళ్లపై జగన్ పేర్లు, ఫోటోలను చెరపడానికి రూ.కోట్లు ఖర్చు చేయడం వల్ల ప్రజలకు ఒరింగిందేమిటని జనం ప్రశ్నిస్తున్నారు.

ప్రభుత్వ వైద్యకళాశాలను ప్రయివేటుపరం చేస్తే ఊరుకోం

- పోలీసులకు, వైసిపి నాయకులకు మధ్య తోపులాట
- పోలీసుల ఆంక్షలను నెట్టుకుంటూ కళాశాల వద్దకు చేరుకున్న వైసిపి శ్రేణులు



వైసిపి యువజన, విద్యార్థి విభాగం నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

ప్రజాశక్తి - కంటోన్మెంట్

ప్రభుత్వ మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ వైసిపి యువజన విభాగం, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం చలోమెడికల్ కాలేజీ పేరిట శుక్రవారం చేపట్టిన నిరసన కార్యక్రమం ఉద్రిక్తతలకు దారి తీసింది. ఈ కార్యక్రమానికి అనుమతి లేదంటూ పోలీసులు ఆంక్షలు పెట్టారు. శాంతియుతంగా నిరసన తెలుపుతామని వైసిపి నాయకులు చెప్పినప్పటికీ పోలీసులు అంగీకరించలేదు. అయినప్పటికీ వివిధ ప్రాంతాల నుంచి మెడికల్ కాలేజీ వద్దకు వచ్చే వారిని పోలీసులు అడ్డుకునే ప్రయత్నాలు చేశారు. వైసిపి యువజన, విద్యార్థి నాయకులు, పార్టీ నాయకులు పోలీసుల ఆంక్షలు , అడ్డంకులను నెట్టికుంటూ వైద్య కళాశాల వరకు భారీ ర్యాలీ నిరసన చేపట్టారు. ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రైవేటు పరం చేస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేసారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలను ప్రారంభించారన్నారు. పేద మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులో ఉంచే విధంగా ఈ కళాశాలలను ప్రారంభిస్తే ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు మెడికల్ కళాశాలను ప్రైవేటుపరం చేయడం అన్యాయం అన్నారు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలను ప్రైవేటుపరం చేసి ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజాం నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ తలే రాజేష్, వైసిపి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు అల్లు అవినాష్, విద్యార్థి విభాగం అధ్యక్షుడు కరుమజ్జి సాయికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శులు వర్రి నర్సింహమూర్తి, సంగంరెడ్డి బంగారు నాయుడు, రాష్ట్ర కార్యదర్శి కెవి సూర్యనారాయణరాజు, నాయకులు జి.ఈశ్వర్‌కౌశిక్ పాల్గొన్నారు.

నిర్ణయం వెనక్కి తీసుకోవాలి : ఆప్

కంటోన్మెంట్ : ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటికరణ చేసేలా కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన జీవోను వెంటనే రద్దు చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కె.దయానంద్ డిమాండ్ చేసారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని, పి పి పి విధానంలో సామాన్యులు ఏ విధంగా వైద్య విద్యను అందుకోగలరని ప్రశ్నించారు. విద్యార్థులు పట్ల చిత్తశుద్ధి ఉంటే గత ప్రభుత్వం తీసుకువచ్చిన 17 ప్రభుత్వ మెడికల్ కాలేజ్ లను మరింత మెరుగ్గా తీర్చిదిద్ది సామాన్య విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలి తప్ప వైద్య విద్యను వారికి దూరం చేయాలని చూడటం సరికాదని అన్నారు.

ప్రయివేటీకరణ అన్యాయం : బిఎస్‌పి

భోగాపురం : ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణ అన్యాయమని బిఎస్‌పి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎరుకొండ వెంకట్రావు అన్నారు. శుక్రవారం భోగాపురంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రయివేటీకరణతో పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారని తెలిపారు. చంద్రబాబు కార్పొరేట్ సంస్థలకు, తన మంత్రి నారాయణ వంటి వారితో వ్యాపారాలు సాగించుకోవడానికే ఇలాంటి నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు.

వినతులను వెంటనే పరిష్కరించాలి

కలెక్టర్ రామసుందర్‌రెడ్డి • ఉద్యోగుల నుంచి వినతుల స్వీకరణ

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఉద్యోగుల నుండి అందిన వినతులను జిల్లా స్థాయి లో పరిష్కారం అయ్యే వాటికి సరైన ఎండార్స్మెంట్ ఇచ్చి వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్. రామ్ సుందర్ రెడ్డి తెలిపారు. జిల్లా స్థాయి లో పరిష్కారం కాని వాటిని రాష్ట్ర స్థాయికి పంపాలని, పాలసీ కి సంబంధించిన వాటిని కూడా ప్రభుత్వానికి పంపాలని అధికారులకు సూచించారు. . ప్రతి 3 వ శుక్రవారం ఉద్యోగుల కోసం నిర్వహిస్తున్న గ్రీవెన్సు లో అందిన దరఖాస్తుల పరిష్కారం పై అదే వారంలో సమీక్ష చేస్తామని కలెక్టర్ స్పష్టం చేసారు. శుక్రవారం నిర్వహించిన ఉద్యోగుల గ్రీవన్సు కు ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నుండి 40 వినతులు అందాయి. ఈ వినతులను సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్, డిఆర్‌ఒ శ్రీనివాస మూర్తి స్వీకరించగా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున ఉద్యోగి

కొన్ని వినతులు

- రామవరం , నరవ పంచాయతీ కార్యదర్శులకు, విఆర్‌ఒలకు హెచ్‌ఆర్‌ఎ 10 శాతం ఇస్తున్నారని, మిగిలిన వారికీ ఇచ్చినట్లు గానే 16 శాతం ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షులు వై. రమణ , ఎన్‌జిఒ సంఘం వైస్ ప్రెసిడెంట్ జిల్లా కలెక్టర్‌కు వినతి సమర్పించారు.
- డ్వామాలో పనిచేస్తున్న ఎఫ్.టి.ఇ ఉద్యోగులు గ్రేడ్ ఫిక్షేషన్ , పిఆర్‌సి, నగదు రహిత హెల్త్ కార్డులను జారీ చేయాలని కోరుతూ వినతులను సమర్పించారు.
- చీపురుపల్లి ఆర్‌ఇసిఎస్ పరిధి లో పని చేస్తున్న గ్రామ వార్డు గ్రేడ్ 2 ఉద్యోగులు తమకు 4 ఏళ్ళు అవుతున్నప్పటికీ రెగ్యులరైజేషన్ చేయలేదని, ఇప్పటికీ నెలకు 15 వేల జీతం మాత్రమే ఇస్తున్నారని, సర్వీస్ రెగ్యులరైజేషన్ చేయాలని కోరారు.
- ఆంధ్ర ప్రదేశ్ వైద్య విధాన పరిషత్ కాంట్రాక్టు ఉద్యోగులు వారికీ బేసిక్ పే మాత్రమే ఇస్తున్నారని, డిఎ, హెచ్‌ఆర్‌ఎ ఇవ్వడం లేదని, చట్టం ప్రకారంగా వారిని రెగ్యులర్ చేయాలని , సర్వీస్ బ్రేక్ లేకుండా చూడాలని కోరుతూ వినతులు అందజేశారు.
- గ్రామ రెవిన్యూ సహాయకులుగా పనిచేస్తున్న ఉద్యోగుల విఆర్‌ఒలుగా అట్టెండర్లుగా, నైట్ వాచ్ మన్‌గా ఉద్యోగోన్నతులు కల్పించాలని , ఉమ్మడి జిల్లా సీనియారిటీ లిస్టు లను పబ్లిష్ చేయాలని కోరుతూ గ్రామా రెవిన్యూ సహాయకుల సంఘం తరపున వినతులు అందజేశారు.

21న గురజాడ జయంతి

ప్రజాశక్తి- విజయనగరంకోట

మహాకవి గురజాడ వెంకట అప్పారావు జయంతోత్సవాన్ని ఈ నెల 21 ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి ఆదేశించారు. ఉత్సవ నిర్వహణపై సంబంధిత అధికారులతో తమ ఛాంబర్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆదివారం ఉదయం 9 గంటలకు గురజాడ స్వగృహంలో కార్యక్రమాన్ని ప్రారంభించాలని, అక్కడినుంచి గురజాడ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం పూలమాలలతో మహాకవికి నివాళు లర్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, పర్యాటకాధికారి కుమారస్వామి, మున్సిపల్ కమిషనర్ పి.నల్లనయ్య, డిఇఒ మణిక్యంనాయుడు, డిఎస్‌పి గోవిందరావు, డిపిఆర్‌ఒ పి.గోవిందరాజులు, ప్రభుత్వ సంగీత కళాశాల ప్రిన్సిపల్ మండపాక నాగలక్ష్మి, గురజాడ కుటుంబ సభ్యులు ఇందిర తదితరులు పాల్గొన్నారు.



నల్లజెండాలతో నిరసన తెలుపుతున్న జిందాల్ నిర్వాసితులు

నిర్వాసితుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని

నల్లజెండాలతో నిరసన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

జిందాల్ నిర్వాసితుల కోసం అసెంబ్లీలో మానవీయ కోణంలో చర్చించి న్యాయం చేయాలని సిపిఎం నాయకులు చల్లా జగన్ డిమాండ్ చేశారు. మండలంలోని బొడ్డవరలో తమ భూమి తిరిగి ఇవ్వాలంటూ నిర్వాసితులు నల్ల జెండాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 ఏళ్లయినా కంపెనీ కట్టలేదని, సర్వం కోల్పోయిన నిర్వాసితులకు తిరిగి భూమి ఇవ్వాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో ఎంపిపి సొండి సోమేశ్వరరావు, పెదకండేపల్లి సర్పంచ్ యల్ల వెంకటరమణ, ఎంపిటిసి సభ్యులు బోదల దేవుడు, మాజీ ఎంపిపి ఒంటి అప్పారావు, మాజీ ఎంపిటిసి సభ్యులు బోజంకి గోవిందరావు, మురళిరాజు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

విజయనగర ఉత్సవాలకు సన్నద్ధం కావాలి

కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి

ప్రజాశక్తి-విజయనగరంకోట

పైడితల్లి అమ్మవారి పండగ సందర్భంగా విజయనగరం ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి తెలిపారు. ఉత్సవ ఏర్పాట్ల పై ఆయన ఛాంబర్ లో ఉత్సవ్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత ఏడాది ఏయే కార్యక్రమాలు నిర్వహించారు, అందుకు ఎంత మొత్తం నిధులు ఖర్చయ్యాయి అనే అంశాల పై ఆరా తీసారు. నిధుల లభ్యత ను బట్టి ఈ ఏడాది కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడలు, సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు, సైన్సు ఫేర్, కవి సమ్మేళనం , జానపద కళా ప్రదర్శనలు, నాటికలు, నాటకాలు, పుష్ప ప్రదర్శన, తదితర కార్యక్రమాలను యథా విధిగా నిర్వహించడానికి సిద్ధంగా ఉండాలన్నారు. అయితే నిధుల లభ్యత మేరకు జిల్లా మంత్రితో చర్చించిన మీదట తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. సమావేశంలో జెసి సేతు మాధవన్, డిఆర్‌ఒ శ్రీనివాసమూర్తి, జిల్లా పరిషత్ సిఇఒ సత్యనారాయణ, డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాస రావు, మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, వ్యవసాయ శాఖ ఇంచార్జ్ అధికారి భారతి తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ రైటర్ల పెన్‌డౌన్

ప్రజాశక్తి- భోగాపురం

రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖలో ఇటీవల తీసుకొచ్చిన సాఫ్ట్‌వేర్ 2.0లో నూతనంగా పొందుపరిచిన ఒటిపి అనే కొత్త విధానానికి వ్యతిరేకంగా డాక్యుమెంట్ రైటర్లు ఆందోళనబాట పట్టారు. శుక్ర, శనివారాల్లో రాష్ట్ర వ్యాప్తంగా డాక్యుమెంట్ రైటర్లు పెన్‌డౌన్‌కు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం భోగాపురంలోని డాక్యుమెంట్ రైటర్లు పెన్‌డౌన్ సమ్మె చేపట్టి, నిరసన తెలిపారు. సాఫ్ట్‌వేర్‌లోని లోపాలను సవరించి ప్రభుత్వం వెంటనే రైటర్లకు, కక్షిదారులకు న్యాయం చేయాలని దస్తావేజు లేఖర్లు కోరారు.

చిత్రకళ సమ్మేళనం ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం కోట

మహారాజ ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో చిత్ర కళా సమ్మేళనం ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ మండపాక నాగలక్ష్మి తెలిపారు. వికసిత భారత్ 2047 సందర్భంగా ప్రారంభమైన సేవా పర్వ్ చిత్ర కళా సమ్మేళనంలో భాగంగా శుక్రవారం స్టోరీ టెల్లింగ్ ప్రోగ్రాం జరిగింది. చెవిటిమూగ విద్యార్థులపాఠశాల ఉపాధ్యాయులు అప్పలరాజు, జొన్నవలస జెడ్‌పి హైస్కూలు ఆర్ట్స్ ఉపాధ్యాయుడు రేజేటి కరుణాకర్ ప్రాథమిక వర్ణాలు, ద్వితీయ, శ్రేణి రంగులు, చల్లని రంగులు, వేడి, రంగుల గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు , ఇతర ప్రైవేట్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్రాంత గాత్ర అధ్యాపకులు బి.ఎ.నారాయణ, గురుప్రసాద్ విచ్చేసి విద్యార్థులకు వికసిత భారత్ ఉద్దేశ్యం విద్యార్థులకు తెలియజేశారు.

యూరియా పంపిణీలో ప్రభుత్వం విఫలం

మాజీ ఎమ్మెల్యే శంబంగి

ప్రజాశక్తి-రామభద్రపురం

రైతులకు సకాలంలో యూరియా పంపిణీ చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు ఆరోపించారు. మండల వైసిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అదునుమీద యూరియా దొరకక పోవడంతో రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు తీసుకోక పోవడంతో ఈ పరిస్థితి దాపురించిందని, రాత్రివేళల్లో కూడా యూరియా కోసం రైతులు వేచి చూడడం విచారకరమని అన్నారు. వైసిపి హయాంలో ప్రతీ లోక్ సభ నియోజకవర్గానికి ఒక ప్రభుత్వ వైద్య కళాశాల ఉండాలనే నిర్ణయంతో రాష్ట్రంలో 17 వైద్య కళాశాలలను తీసుకువచ్చారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్క మెడికల్ కళాశాల కూడా ఏర్పాటు చేయకపోగా ఉన్న వైద్య కళాశాలను ప్రైవేటీకరించడం ఘోరమైన తప్పిదమని విమర్శించారు. సమావేశంలోఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు, బొబ్బిలి మున్సిపల్ మాజీ చైర్మన్ సావు వెంకటమురళీ కృష్ణ, విశాఖ డెయిరీ అధ్యక్షులు చొక్కాపు చిన్నంనాయుడు (రామకష్ణ) పాల్గొన్నారు.

కండక్టర్, డ్రైవర్ సమస్యలపై కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకం అమలులో డ్రైవర్లకు, కండక్టర్లకు ఎదురవుతున్న సమస్యలపై ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యుఎఫ్ యూనియన్ డిపో కార్యదర్శి చంద్రయ్య ఆధ్వర్యాన శుక్రవారం కలెక్టర్‌కు వినతి అందజేశారు. స్త్రీశక్తి పథకాన్ని సమర్ధవంతంగా అమలు చేసేందుకు ప్రజారవాణా శాఖ అధికారులు కొన్ని చర్యలు చేపట్టాలని కోరారు. టిక్కెట్లు ఇచ్చే మిషన్ ద్వారా ఉదయం నుండి సాయంత్రం వరకు కంటిన్యూగా టిక్కెట్లు జారీ చేయడం వల్ల మిషన్ ఛార్జింగ్ అయిపోతోందని, దీనివల్ల ప్రయాణికులకు అసౌకర్యం కలుగుతుందని తెలిపారు. కావున ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాలన్నారు. కదులుతున్న బస్సులోకి సెల్‌ఫోన్ మాట్లాడుతూ బస్సు ఎక్కరాదు. దిగరాదు అన్న విషయాన్ని, బస్సు ఎక్కిన ప్రయాణికులు కొంచెం కొంచెం జరిగి మిగతా ప్రయాణికులను ఎక్కించుకొనేందుకు సహకరించాలన్న విషయాలను అవగాహన కల్పించాలన్నారు. బస్సులలో విపరీతమైన జనాలు ఉన్నప్పుడు పొరపాటున ఎవరైనా టిక్కెట్టు తీసుకోకపోతే తనిఖీ అధికారులు బస్సును ఆపి కేసులు రాయడం వల్ల ప్రయాణికులకు అసౌకర్యం కలుగుతుందన్నారు. గతంలో మాదిరి స్పాట్ ఇన్సెంటివ్ చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షులు ఎస్‌కె రఫీ, సహాయ కార్యదర్శి బి.లక్ష్మి, సభ్యులు లావణ్య జగదీ, పిఆర్ అప్పడు, పివి రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి కాంప్లెక్సులో సెల్‌ఫోన్ల చోరీ

పట్టని ఆర్‌టిసి అధికారులు, పోలీసులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా కేంద్రంలోని ఆర్‌టిసి కాంప్లెక్సులో తరచూ సెల్‌ఫోన్లు చోరీలు జరుగుతున్నాయి. ప్రయాణికుల రద్దీని ఆసరా చేసుకొని కొంతమంది దొంగలు ప్రయాణికుల జేబుల్లోని సెలఫోన్లను చోరీ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచితబస్సు పథకం తరువాత బస్సుల్లో రద్దీ విపరీతంగా పెరగడంతో రోజూ నాలుగైదు సెల్‌ఫోన్లు పోతున్నాయి. తాజాగా ఈనెల 17న ఉదయం గజపతినగరం మండలం పాత బగ్గాంకు చెందిన సంగంరెడ్డి చిరంజీవి తనకుటుంబ సభ్యులతో కలసి సింహాచలం వెళ్లేందుకు బస్సు ఎక్కుతుండగా తన జేబులో ఉన్న సెల్ఫ్‌ఫోన్ చోరీకి గురైంది. వెంటనే బాధితుడు ఆర్‌టిసి అధికారులను సంప్రదించి సిసి ఫుటేజ్ చూపించాలని కోరినా సరైన సమాధానం చెప్పకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. రోజూ నాలుగైదు సెల్‌ఫోన్ల చోరీలు జరుగుతున్నా అటు ఆర్‌టిసి అధికారులు గాని, పోలీసులు గాని సకాలంలో స్పందించడం లేదని బాధితులు వాపోతున్నారు.

ప్రధానంగా ఆర్‌టిసి కాంప్లెక్సులో 62 సిసి కెమెరాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటిని పరిశీలిస్తే చోరీకి పాల్పడిన నిందితులను గుర్తించే అవకాశం ఉంది. అయితే సెల్‌ఫోన్లు పోగుట్టుకున్న బాధితులు డిపో మేనేజర్‌కు ఫిర్యాదు చేస్తే స్టేషన్ మాస్టర్ రూమ్‌లో ఉన్న సిసి టివి పుటేజిని పరిశీలించేందుకు అవసరమైన కంప్యూటర్, మౌస్ తదితర మైనవి లేనట్లు తెలుస్తోంది. మరోవైపు నిత్యం రద్దీగా ఉండే వైజాగ్, సింహాచలం వైపు వెళ్లే బస్సులు వద్ద సీసీ కెమెరాలు పదుల సంఖ్యలో ఉన్నా వాటిలో కొన్ని పని చేయకపోవడంతో దొంగలు మరిన్ని చోరీలు చేయడానికి అనువుగా తయారయ్యింది. ఆర్‌టిసి కాంప్లెక్సు వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో ఉండడడంతో బాధితులు వారికి ఫిర్యాదు చేస్తే అక్కడి పోలీసులు వచ్చి చూసేవరకు వేచి ఉండాల్సి వస్తోంది. ఇదంతా జరిగేసరికి దొంగలు అక్కడి నుంచి ఉటాయించడం పరిపాటిగా మారుతోంది. ప్రధానంగా బస్‌స్టేషన్‌లో పోలీస్ ఔట్ పోస్ట్ లేకపోవడం కూడా చోరీలకు ఆస్కారం ఏర్పడుతోందని బాధితులు వాపోతున్నారు. జిల్లా కేంద్రంలో ఉన్న కాంప్లెక్స్ లో నిరంతరం వేల సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో ఇక్కడ పోలీసు ఔట్‌పోస్టు ఏర్పాటు చేసి దొంగతనాలను, అ సాంఘిక కార్యకలాపాలను అరికట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.



విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్సు

గడువులోగా లేఅవుట్ క్రమబద్ధీకరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ నిర్దేశించిన గడువులోగా లే అవుట్ క్రమబద్ధీకరణ దరఖాస్తులను పరిష్కరించేందుకు కృషి చేయాలని లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్, ప్రణాళిక కార్యదర్శులకు అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి సూచించారు. శుక్రవారం కార్యాలయంలో నిర్వహించిన టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం సమావేశంలో వారు మాట్లాడారు. అక్టోబర్‌తో లే అవుట్ క్రమబద్ధీకరణ పథకం గడువు ముగుస్తున్నందున తక్షణమే నిర్దేశిత దరఖాస్తులను, సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ లే అవుట్ వివరాలను సేకరించి అవసరమైన క్రమబద్ధీకరణ చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో టిపిఒ అప్పలరాజు, టిపిఎస్ అనిత పాల్గొన్నారు.

క్రషింగ్ ఆపాలని ఆందోళన

ప్రజాశక్తి - శృంగవరపుకోట

జామి మండల కేంద్రంలోని మాధవరాయమెట్ట కాలనీ వద్దనున్న స్టోన్ క్రషర్‌లో పరిమితికి మించి క్రషింగ్ చేస్తున్నారంటూ కాలనీ మహిళలు శుక్రవారం ఆందోళనకు దిగారు. 40 టన్నులు క్రషింగ్‌కు కాలుష్య నియంత్రణ శాఖ అనుమతులు ఇచ్చిందని, యాజమాన్యం 400 టన్నులకు పైగా ఆడుతుందని మహిళలు ఆరోపించారు. క్రషింగ్ ఆపాలని కోరిన మహిళలపై పోలీసులు బెదిరింపులకు దిగడం అన్యాయమన్నారు. కాలనీ ప్రజలు వ్యాధుల బారిన పడుతుంటే, అధికారులకు పట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్ఐ వీరజనార్ధన్ అక్కడకు చేరుకుని, క్రషర్ వద్ద నుంచి వెళ్లిపోవాలని, లేకుంటే అందరిపై కేసులు పెట్టి జైలుకు పంపుతానని బెదిరించడం సరికాదన్నారు.



క్రషింగ్ ఆపాలని నిలదీస్తున్న మహిళలు

మహిళా ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత

ప్రజాశక్తి-బొబ్బిలి

మహిళా ప్రయాణికులు భద్రతకు రైల్వే శాఖ ప్రాధాన్యత ఇస్తుందని ఎస్‌ఐపిఎఫ్ పర్దిప్ కుమార్, షిఫ్ట్ ఆఫీసర్ ఎఎస్ఐ మురళీకృష్ణ అన్నారు. స్థానిక రైల్వే స్టేషన్లో శుక్రవారం మేరీ సహేలీ యాప్‌పై మహిళా ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఒంటరిగా రైలులో ప్రయాణం చేసే మహిళలకు భద్రత కల్పించేందుకు మేరీ సహేలీ యాప్ తీసుకొచ్చినట్లు చెప్పారు. మహిళలు స్మార్ట్ ఫోన్లలో యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని కోరారు.

అసెంబ్లీకి జగన్ వెళ్లకపోవడం సరికాదు

లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ

ప్రజాశక్తి- కంటోన్మెంట్

ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వెళ్తానని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వ్యాఖ్యానించడం సరికాదని లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జి అన్నారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎంపీగా, ఎమ్మెల్యేగా, ముఖ్యమంత్రిగా పార్లమెంటరీ ప్రొసీజర్ పట్ల అనుభవం ఉన్న జగన్మోహన్ రెడ్డి తన స్వార్ధ రాజకీయాలకు మిగతా పది మంది ఎమ్మెల్యేలను ఆయా నియోజకవర్గాల ప్రజల ముందు దోషులను చేయడం సరికాదన్నారు. జగన్మోహన్ రెడ్డి తో పాటుగా ఎన్నికయిన 11 మందిలో నలుగురు కొత్తవారని అందులో ఇద్దరు అరుకు, పాడేరు లాంటి గిరిజన ప్రాంతాల నుండి తొలిసారిగా ప్రజా ప్రతినిధులుగా గెలిచి అసెంబ్లీ లోకి అడుగులు పెట్టకుండా ఉంటే జగన్మోహన్ రెడ్డి ప్రజలకు ఏమి సమాధానం చెబుతారని ప్రశ్నించారు. పజల తరపున మాట్లాడటానికి ఉన్న వేదిక రాష్ట్ర అసెంబ్లీ మాత్రమేనని మరచిపోకూడదని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం జగన్మోహన్ రెడ్డి తన ఎమ్మెల్యేలతో అసెంబ్లీ సమావేశాలకు హాజరవ్వాలని, లేకుంటే రాజీనామా చేసి కొత్తవారికి అవకాశం ఇస్తే బాగుంటుందని సూచించారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు అల్లంశెట్టి నాగభూషణం, కార్పొరేషన్ అధ్యక్షుడు తాత్రాజు రాజారావు,ప్రధాన కార్యదర్శి పి.ఎల్.ఎన్. రాజు,ఉపాధ్యక్షుడు బోర రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వల్లంపూడి రైతు సేవా కేంద్రం వద్ద గుమికూడిన రైతులు

యూరియా పంపిణీ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో వల్లంపూడిలో 260, ఆతవలో 250, బల్లంకిలో 260 యూరియా బస్తాలను శుక్రవారం రైతులకు పంపిణీ చేసినట్లు ఎఒ స్వాతికుమారి తెలిపారు. రైతులు ఒక్కసారిగా తరలిరావడంతో వారిని వరుసలో నిలబెట్టి సీరియల్ ప్రకారం యూరియా పంపిణీ చేశారు. మండలంలో యూరియా కొరత లేదని ఎఒ తెలిపారు. మిగిలిన రైతులకు కూడా రెండు రోజుల్లో ఎరువులు పంపిణీ చేయుటకు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది అక్కునాయుడు, కోమలి, తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యుల పోస్టులను భర్తీ చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న పశు వైద్యులు పోస్టులను భర్తీ చేయాలని ఎమ్మెల్యే బేబినాయన ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ సమావేశాలలో శుక్రవారం పశువుల ఆసుపత్రుల సమస్యలను ప్రస్తావించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొట్టక్కి, వాడాడ పశువుల ఆసుపత్రులలో వైద్యులు లేకపోవడంతో ఆయా పరిసర గ్రామాల పాడి పశువులకు వైద్యం అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. శిథిలావస్థకు చేరిన ఆసుపత్రి భవనాల స్థానాల్లో కొత్తగా నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పశు వైద్య విద్యార్థులకు చెల్లిస్తున్న స్టైఫండ్ పెంచాలని కోరారు. బొబ్బిలి మున్సిపాలిటీలో వార్డు సచివాలయాలలో రైతు సేవా కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల మున్సిపాలిటీలో పశు సంపద ఎక్కువగా ఉన్నప్పటికీ, పాడి రైతులు సబ్సిడీపై పశుదాణా, పశుగ్రాస విత్తనాలు పొందలేకపోతున్నారని చెప్పారు. మున్సిపాలిటీ పరిధిలో రైతుసేవా కేంద్రాలు ఏర్పాటు చేసి పశుసంవర్ధక సహాయకులని నియమించి, పాడి రైతులకు కావలసిన సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. సబ్సిడీపై పశు దాణా, గడ్డి ఇవ్వాలన్నారు.



సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న చైర్మన్ శరత్

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-బొబ్బిలి

అన్న క్యాంటీన్ పెట్టిన సిఎం చంద్రబాబు చిత్రపటానికి శుక్రవారం మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్ బాబు, టిడిపి పట్టణ అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు, గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ రౌతు రామమూర్తి పాలాభిషేకం చేశారు. అన్న క్యాంటీన్ ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆస్తులను పన్ను పరిధిలోకి తీసుకురావడమే లక్ష్యం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రతీ ఆస్తిని పన్ను పరిధిలోకి తీసుకురావాలన్నదే తమ లక్ష్యమని సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు అన్నారు. శుక్రవారం నగరంలో ఇంటింటి సర్వే చేపట్టారు. సచివాలయ కార్యదర్శులు, నగరపాలక సంస్థ సిబ్బంది, టీమ్ లుగా ఏర్పడి ఇంటింటికి వెళ్లి ఆస్తి యొక్క వివరాలను కొలతలను సేకరిస్తున్నారు. అక్టోబర్ 10వ తేదీ లోపుగా సర్వే పూర్తి చేసి నివేదికలు సమర్పించనున్నట్లు చెప్పారు.

ఆతవ సచివాలయంలో తనిఖీలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని ఆతవ గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. గ్రామ సచివాలయ భవనం పూర్తి కాకపోవడానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పర్యటించి పారిశుధ్య పనులు పరిశీలించారు. తాగునీటి కొళాయిల వద్ద, గోతుల్లో నీరు నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. పాఠశాలను కూడా సందర్శించారు. గ్రామంలో రైతులకు యూరియా పంపిణీపై ఆరాతీశారు. కార్యక్రమంలో మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ పైడ్రాజు, తదితరులు పాల్గొన్నారు.



విగ్రహావిష్కరణ చేస్తున్న ఎంఇఒలు

జ్ఞాన సరస్వతి విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మండలంలోని కొండగుంపాం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం జ్ఞాన సరస్వతి విగ్రహాన్ని ఎంఇఒలు సూర్యనారాయణ మూర్తి, జ్ఞానశంకర్ ఆవిష్కరించారు. విగ్రహ ఏర్పాటుకు టిడిపి నాయకులు పతివాడ గోవిందరావు నిధులు సమకూర్చారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం యు.శ్రీనివాసరావు, సర్పంచ్ పతివాడ అప్పన్న, వార్డు సభ్యులు రెడ్డి సన్యాసినాయుడు, విద్యాకమిటీ చైర్‌పర్సన్ బర్ల సంతోషి, వైస్ చైర్మన్ నడిపేన వెంకటలక్ష్మి పల్లి అచ్చన్న, పతివాడ శంకరరావు కూటమి నాయకులు పతివాడ బుజ్జి పాల్గొన్నారు.

గెడ్డ కబ్జాపై ఫిర్యాదు

ప్రజాశక్తి- భోగాపురం

మండలంలోని రాజాపులోవలో గెడ్డ వాగు కబ్జాకు గురవుతుందని గ్రామానికి చెందిన ఎం.గురునాథ్, బి.రామకృష్ణ, చందక షణ్ముఖ శుక్రవారం తహశీల్దార్ ఎం.మణమ్మకు ఫిర్యాదు చేశారు. గ్రామాన్నే ఆనుకొని గెడ్డ ఉందని, వర్షాలు పడేటప్పుడు ఆ గెడ్డ ద్వారా నీరంతా పక్కనే ఉన్న చెరువుకు చేరేదని తెలిపారు. ప్రస్తుతం కొంతమంది గెడ్డను కప్పివేయడంతో రోడ్డుపై నిలబడి పోతుందని విన్నవించారు. దీంతో సిసి రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని చెప్పారు. ఆక్రమణలను తక్షణమే తొలగించి ప్రజలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.

డిపోను పరిశీలించిన డిపిటిఒ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఆర్‌టిసి శృంగవరపుకోట డిపోను శుక్రవారం డిపిటిఒ వరలక్ష్మి సందర్శించారు. డిపోలో అన్ని సెక్షన్లు తనిఖీ చేసి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. పార్సిల్, కొరియర్ సెక్షన్ కూడా తనిఖీ చేశారు. అల్ట్రా డీలక్స్, అల్ట్రా పల్లెవెలుగు బస్సులలో డిక్కీ లను పార్సిల్, కొరియర్ రవాణాకు అద్దె ప్రాతిపదికన ఇస్తామని డిపిటిఒ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ వ్యాపారం అభివృద్ధి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ సుదర్శన్, సూపర్వైజర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన మహిళ..

శక్తివంతమైన కుటుంబానికి పునాది

ప్రజాశక్తి -గుర్ల

ఆరోగ్యవంతమైన మహిళ శక్తివంతమైన కుటుంబానికి బలమైన పునాదిగా ఉండాలని సిడిపిఒ ఆరుద్ర తెలిపారు. రాష్ట్రీయ పోషణ మహోత్సవంలో భాగంగా గుజ్జింగివలస గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పిల్లలకు సంబంధించిన వివిధ అంశాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

శృంగవరపుకోట : పురుషుల భాగస్వామ్యంతో ఆ కుటుంబంలో స్త్రీ మరింత ఎదుగుతుందని సిడిపిఒ అచ్యుతాంబ అన్నారు. స్వస్త్ నారి స్వశక్తి పరివార్ అభియాన్ ప్రోగ్రాంలో భాగంగా మండలంలోని పోతనాపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలు పౌష్టికాహారం తీసుకునే విషయంలో పురుషులను కూడా భాగస్వామ్యం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కొట్టం పిహెచ్‌సి డాక్టర్ శిరీష, ఐసిడిఎస్ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య సేవలు వినియోగించుకోవాలి

దత్తిరాజేరు : మహిళలు 14 రకాల వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరప కొత్తవలస పిహెచ్‌సి వైద్యులు కె.రఘు కోరారు. శుక్రవారం పాచలవలస గ్రామంలో స్వస్థ నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. 56 మందికి వైద్య సేవలు అందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పౌష్టికాహార స్టాల్స్ ద్వారా గర్భిణులు, బాలింతలకు అంగన్వాడీలు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్యామల, ఎంపిటిసి సభ్యులు హైమావతి, ఎంపిహెచ్ఒ బి.మురళి, హెచ్ఎస్ఆర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



రేగిడి.. మహిళలకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రీనా చౌదరి

కోడిశలో వైద్య శిబిరం

రేగిడి : కోడిశలో సర్పంచ్ గురవాన రమేష్ నాయుడు ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన వైద్య శిబిరంలో 116 మంది మహిళలకు బూరాడ పిహెచ్‌సి వైద్యాధికారి రీనా చౌదరి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. హెల్త్ ఇఒ రాధాకృష్ణ పాల్గొన్నారు

స్వచ్ఛభారత్‌లో గ్రీన్ అంబాసిడర్ల పాత్ర ఎంతో కీలకమని ఎంపిడిఒ శ్యామలకుమారి, ఇఒపిఆర్‌డి వి.జగన్నాథరావు తెలిపారు. పనసలవలస గ్రామంలో శుక్రవారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా గ్రీన్ అంబాసిడర్లకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ పద్మ, గేదెల గోవిందరావు, నర్సునాయుడు, కార్యదర్శి బి.రాము, ఎఎన్ఎంలు ఆర్.నాగమ్మ, ఎ.హైమ, సరస్వతి పాల్గొన్నారు.

బిపిఎం పాఠశాలలో స్వచ్ఛత హీ సేవ

విజయనగరం టౌన్ : స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక బిపిఎం పాఠశాలలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని అక్టోబర్ 2 వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. విద్యార్థి దశ నుండి పరిశుభ్రతపై అవగాహన కల్పించే కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టామన్నారు. హెచ్ఎం శంకర్రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జిల్లా జడ్జి బబితకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్

జిల్లా జడ్జిని కలిసిన కలెక్టర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబితను, జిల్లా కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

డ్రైడే పాటించాలి : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రతి ఒక్కరూ ఫ్రైడే ను డ్రైడే గా పాటించే విధంగా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ప్రజారోగ్య సిబ్బందికి కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. శుక్రవారం సచివాలయాల పరిధిలో ప్రజారోగ్య సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు పర్యటించి నీటి నిల్వలను తొలగించి వేశారు. నీటి నిల్వల వల్ల కలిగే అనర్థాలను మహిళలకు వివరించారు. దోమల వల్ల అంటురోగాలు, ఇతర వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని చెప్పారు. రానున్న రోజుల్లో వర్షాలు కురిసే ఆస్కారం ఉన్న రీత్యా ఇప్పటి నుండి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు.

పాఠశాలల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని ముకుందపురం, ఓబులయ్యపాలెం పాఠశాలలను ఎంఇఒ పి.బాలభాస్కరరావు శుక్రవారం సందర్శించారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులను పరిశీలించారు. ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిఆర్‌ఎంటి కె.రాంప్రసాద్ పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాజేష్

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-గజపతినగరం

విజయనగరం తిరుమల-మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యాన శుక్రవారం స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్‌లో ఉచిత వైద్య శిబిరంనిర్వహించారు. బిపి, సుగర్, ఇసిజి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. జనరల్ ఫిజిషియన్ డాక్టర్ రాజేష్‌పల్లంరాజు, కార్డియాలజిస్టు డాక్టర్ అఖిలేష్ వైద్యసేవలందించారు. ఇసిజిలో సమస్య ఉన్న వారికి తదుపరి పరీక్షల కోసం తిరుమల మెడికవర్ ఆస్పత్రికి రావాలని సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ పల్లంరాజు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. రెండు రోజులు వరకు జ్వరం తగ్గకపోతే టెస్టులు చేయించుకోవాలని తెలిపారు.

దళిత కాలనీకి తాగునీటి సదుపాయం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నగర పంచాయతీలోని దళిత కాలనీకి కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ మహేశ్వరీ దంపతులు తాగునీటి సౌకర్యం కల్పించారు. సొంత నిధులు రూ.2 లక్షలతో వాటర్ ట్యాంకు నిర్మించారు. శుక్రవారం బిజెపి జిల్లా అధ్యక్షులు రాజేష్ వర్మ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని, జిల్లా ప్రధాన కార్యదర్శి పతివాడ రాజేష్, నియోజకవర్గ కన్వీనర్ బి.శ్రీధర్, నల్లి బాబు, చందక గోవింద, దోమ కామేశ్వరి, ఎన్.నారాయణమూర్తి, దోమ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై దారి దోపిడీ

ప్రజాశక్తి-రామభద్రపురం

స్కూటీపై వస్తున్న మహిళ నగలును దుండగులు తెంపుకెళ్లారు. ఈ సంఘటన కె.పాలవలస సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం చోటుచేసుకుంది. ఎఎస్ఐ అప్పారావు కథనం ప్రకారం... బాడంగి మండలం గొల్లాది గ్రామానికి చెందిన వంగపండు పుష్ప స్కూటీపై రామభద్రపురం వస్తున్నారు. మండల పరిధిలోని కె.పాలవలస సమీపంలో జాతీయ రహదారిపై గుర్తుతెలియని దుండగులు ఎదురుగా వెళుతూ ఆమెను అడ్డగించి, మెడలో బంగారు గొలుసు తెంచారు. ఈ క్రమంలో ఆమె కింద పడిన తరువాత చెవి దుద్దులు కూడా తెంపుకుని ఉడాయించారు. షాక్ నుంచి తేరుకున్న ఆమె లబోదిబోమంటూ కుటుంబసభ్యులకు విషయం చెప్పారు. అనంతరం రామభద్రపురం పోలీసులకు ఫిర్యాదుచేశారు.

సోలార్ ప్లాంట్‌తో ఎంతో మేలు

ప్రజాశక్తి-గంట్యాడ

పిఎం సూర్య ఘర్ యోజన ద్వారా సోలార్ ప్లాంట్ పెట్టుకున్న వారు ఉచిత విద్యుత్తును పొందవచ్చునని విద్యుత్తుశాఖ ఎఇ శ్రీనివాస్ అన్నారు. కొత్తవెలగాడలో శుక్రవారం రేణుక సోలార్ వెండర్ సేవా పర్వ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ ప్లాంట్ పెట్టుకున్న వారికి విద్యుత్తు ఆదాతో పాటు ఉచిత కరెంటును పొందవచ్చునని అన్నారు ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అన్నారు కార్యక్రమములో రేణుక సోలార్ ప్రతినిధులు, లైన్‌మేన్ పాల్గొన్నారు.

నెల్లిమర్ల : కొండవెలగాడలో పిఎం సూర్యఘర్ పథకంపై డిఇఇ ఎం.భీమరాజు అవగాహన కల్పించారు. సోలార్ విద్యుత్ వినియోగించడం వల్ల బిల్లు తగ్గి వినియోదారులకు లాభం చేకూరుతుందని చెప్పారు. మిగిలిన విద్యుత్‌ను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎఇ డి.పిచ్చయ్య, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి రోటరీ కృషి

ప్రజాశక్తి-విజయనగరం కోట

విద్యార్థుల అభ్యున్నతికి రోటరీ క్లబ్ నిరంతరం కృషి చేస్తుందని విజయనగరం రోటరీ సెంటర్ క్లబ్ అధ్యక్షుడు విజయ్ కుమార్ అగర్వాల్ పేర్కొన్నారు. రోటరీ సెంట్రల్ క్లబ్ నిర్వహిస్తున్న నవతరోత్సవాలలో భాగంగా శుక్రవారం కెఎల్ పురంలోని మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్స్ పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు , జామెట్రీ బాక్స్‌లు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు విజయ్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ రోటరీ నిర్వహిస్తున్న నవతరోత్సవాల పోటీలకు పాఠశాలల నుంచి చక్కని స్పందన లభిస్తుందని అన్నారు. ఈ పోటీలలో విజేతలైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు ఈనెల 30న ముగింపు కార్యక్రమంలో అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రోటరీ సెంట్రల్ క్లబ్ కార్యదర్శి ఉదయ్, ఆర్. శంకర్ రెడ్డి. ప్రధానోపాధ్యాయులు సుహాసిని, మైలపిల్లి పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు లాంఛనాలతో

కానిస్టేబుల్‌కు దహన సంస్కారాలు

ప్రజాశక్తి-బాడంగి

అనారోగ్యంతో మృతి చెందిన పోలీస్ కానిస్టేబుల్ బేతనపల్లి నాగభూషణంకు పోలీసులు లాంఛనాలతో అంతిమ వీడ్కోలు పలికారు. గొల్లాది గ్రామానికి చెందిన నాగభూషణం బొబ్బిలిలో హోంగార్డు గా విధుల్లో చేరి 2009లో కానిస్టేబుల్ గా ఉద్యోగన్నతి పొందారు. ప్రస్తుతం తెర్లాం పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వర్తిస్తున్నారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ విజయనగరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈనేపథ్యంలో ఆయన మృతదేహానికి శుక్రవారం బొబ్బిలి డిఎస్‌పి భవ్యరెడ్డి పాటు పలువురు పోలీస్ అధికారులు నివాళులు అర్పించారు. డిఎస్‌పి చేతులమీదుగా పోలీస్ శాఖ నుంచి ఆర్థిక సాయం అందించారు. అనంతరం పోలీసులు అధికారిక లాంఛనాలతో అంతిమ సంస్కారం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు పోలీసులు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బడ్డుకొండ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-డెంకాడ

మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు జన్మదిన వేడుకలను శుక్రవారం నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. వైసిపి డెంకాడ మండల అధ్యక్షులు పిన్నింటి తమ్మునాయుడు ఆధ్వర్యంలో చింతలవలస గ్రామంలో శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేశారు. ఐనాడ జంక్షన్‌లో కేక్ కట్ చేశారు. పినతాడివాడ సర్పంచ్ లెంక లక్ష్మణరావు ఆధ్వర్యంలో 300 మందికి అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.



డెంకాడ.. కేకు కట్ చేస్తున్న వైసిపి నాయకులు తమ్మునాయుడు

భోగాపురం : మాజీ ఎమ్మెల్యే బొడ్డుకొండ అప్పలనాయుడు 54వ జన్మదినం సందర్భంగా వైసిపి మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఉప్పాడపేటలోని తన నివాసం వద్ద 54 కిలోల కేకు కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పడాలు భానుప్రకాష్, జెడ్‌పిటిసి బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, బైరెడ్డి అప్పలనారాయణ, లాయర్ గురునాథ్ పాల్గొన్నారు.

నెల్లిమర్ల : మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు జన్మదినం సందర్భంగా వైసిపి పట్టణ అధ్యక్షులు చిక్కాల సాంబ శివరావు ఇంటి వద్ద కేక్ కట్ చేశారు. దుర్గా దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూతిక పేటలో సర్పంచ్ లెంక మంగమ్మ, లెంక గోవిందరావు దంపతులు పేదలకు బియ్యం, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు గదల సన్యాసినాయుడు, చిక్కాల సాంబశివరావు, సారికి వైకుంఠం నాయుడు, మత్స సత్య నారాయణ, పతివాడ సత్య నారాయణ, రేగాన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉద్యాన శాఖాధికారి అనూష

ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - గరివిడి

అర్తమూరు గ్రామంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సును ఉద్యాన శాఖ, రాధిక ఆయిల్ పామ్ కంపెనీ సంయుక్తంగా శుక్రవారం నిర్వహించాయి. ఉద్యాన శాఖాధికారి ఎం.అనూష మాట్లాడుతూ ఆయిల్ పామ్ మొక్కలు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. పంట సాగు చేసినందుకు ఎకరాకు రూ.4200 చొప్పున ఏడాదికి అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పొన్నాడ కుమార్, మాజీ సర్పంచ్ రమణమూర్తి, గ్రామ ఉద్యాన సహాయకులు పార్థసారథి పాల్గొన్నారు.

వర్షం పడితే పాఠశాలకు సెలవే

ప్రజాశక్తి - వేపాడ



చెట్టుకింద చదువుకుంటున్న విద్యార్థులు

మండలంలోని కరకవలస పంచాయతీ పరిధిలో ఉన్న కొత్త మారిక, పాత మారిక గిరిజన గ్రామాల్లో 250 గిరిజన కుటుంబాలు ఉన్నాయి. వీరికి చెందిన పిల్లలు చదువుకోవడానికి పాఠశాల లేక చెట్ల కిందే చదువులు సాగిస్తున్నారు. వర్షం వస్తే ఆ పూట చదువులకు సెలవే. వీరు పాఠశాల భవనంలో కూర్చొని చదువుకోవాలంటే కొండ కిందకు పదికిలోమీటర్లు కాలినడకన దిగి చదువుకోవాల్సిందే. కొండపైన పాఠశాల నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ భవన నిర్మాణం మాత్రం చేపట్టలేదు. పలుమార్లు జిల్లా కలెక్టర్ దృష్టికి, ఎమ్మెల్యే, ఎమ్‌పి మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా వచ్చి చూసి వెళ్లడం తప్ప ప్రయోజనం ఉండటం లేదు. ఈ పిల్లలందరికీ ఇద్దరు ఉపాధ్యాయులు కొండపైకి వెళ్లి చెట్లు కింద చదువులు చెప్పి వస్తున్నారు. పిల్లలు చదువుకోవడానికి సరైన సౌకర్యం లేక కొంతమంది పిల్లలు బడికి రావడం మానేస్తున్నారు.

ఎరువుల సమస్యపై అధికారులతో సమీక్ష

ప్రజాశక్తి-దత్తిరాజేరు

మండలంలోని రైతులకు యూరియా కొరత లేకుండా అధికారులు సహకరించాలని మండల ప్రత్యేక అధికారి టి.విమలారాణి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఎరువులు సమస్య రాకుండా అవసరమైతే ప్రైవేట్ డీలర్ల వద్ద ఉన్న ఎరువులు రైతులకు దగ్గరుండి పంపిణీ చేయాలని అధికారులకు సూచించారు. ఏ సచివాలయానికి ఎంత యూరియా అవసరం, వ్యవసాయ అధికారిని అడిగి తెలుసుకున్నారు. శనివారం మూడు రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అధికారులు గ్రామాల్లోకి వెళ్లి రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఆదేశించారు. సమావేశంలో తహశీల్దార్ విజయభాస్కర్, ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్, సిడిపిఒ తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న జెడ్‌పి సిఇఒ సత్యనారాయణ

సిరిపురంలో సిఇఒ పర్యటన

ప్రజాశక్తి-గంట్యాడ

మండలంలోని సిరిపురం గ్రామంలో జెడ్‌పి సిఇఒ బి.వి.సత్యనారాయణ శుక్రవారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్త వేరు చేయడం గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని, తాగునీరు పథకాన్ని పరిశీలించారు. ప్రతిఒక్కరూ తమ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ బి.రాములమ్మ, పంచాయతీ కార్యదర్శి కె.శ్రీను, ఇంజినీరింగ్ సహాయకులు ఆర్‌వై పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్తు అంతరాయం కలుగుతుందని విద్యుత్తుశాఖ ఇఇ పి.త్రినాధరావు ఒక ప్రకటనలో తెలిపారు. పలు ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. ధర్మపురి ఫీడర్ పరిధిలో ధర్మపురి, నోబుల్ నగర్, ఎస్ వి ఎన్ నగర్, వసంత విహార్, బియ్యలపేట, జిఎస్ ఆర్ ఎస్టేట్, కమలా నగర్ ప్రాంతంలో విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు. వసంత విహార్, వసంత విహార్ విల్లాస్, పద్మావతి నగర్ ప్రాంతాల్లో విద్యుత్ నిలుపుదల చేస్తామని తెలిపారు. చెల్లూరు ఫీడర్ పరిధిలో చెల్లూరు, రామజోగి పేట, బడుకొండ పేట ప్రాంతాల్లో విద్యుత్తు ఉండదని చెప్పారు. ఇవే కాకుండా డబుల్ కాలనీ, కేంద్రీయ విద్యాలయం, బాబా మెట్ట, విజ్జి స్టేడియం ప్రాంతాలకు కూడా సరఫరా ఉండదని తెలిపారు. తోటపాలెం సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, బ్యాంక్ కాలనీ ఫీడర్ పరిధిలోని బ్యాంక్ కాలనీ, శ్రీరామ్ నగర్, గోపాల్ నగర్, ఇందిరానగర్, నాగోజీపేట, రైల్వే స్టేషన్ రోడ్ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

నెల్లిమర్ల : రామతీర్థం సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని టౌన్ డిఇఇ పి.త్రినాధరావు ఒక ప్రకటనలో తెలిపారు. 11కెవి పనులు కొనసాగింపు, వ్యవసాయ కనెక్షన్ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. రామతీర్థం, సీతారాముని పేట, జగ్గరాజుపేట, దేవుని నెలివాడ, కొత్తపేట, టొంపలపేట, సువ్వానిపేట, తంగుడుబిల్లి రూరల్ ఫీడర్ మీద తంగుడు బిల్లి, బిసి కాలనీ, దన్నాన పేట, ఎటి అగ్రహారం, కోరాడపేట, తమ్మాపురం గ్రామాల్లో విద్యుత్తు అంతరాయం కలుగుతుందని చెప్పారు.

భోగాపురం : సవరవిల్లి రూరల్ ఫీడర్ పరిధిలో చెట్టుకొమ్మలను తొలగించే ప్రక్రియలో భాగంగా సవరవిల్లి, రావాడ, బసవపాలెం, తూడెం, కౌలువాడ గ్రామాలలో విద్యుత్తుకు అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖాధికారి షేక్ మస్తాన్ వలి తెలిపారు. దీనికి ప్రజలు సహకరించాలని కోరారు.